క్లుప్తంగా

జిల్లా కమిటీ ఎన్నిక



ములుగు: జిల్లా టీడబ్ల్యూజేఏ జర్నలిస్టుల నూతన కమిటీని తాడ్వాయి మండల పరిధిలోని మేడారంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బానోత్ వెంకన్న, ప్రధాన కార్యదర్శిగా శరత్, కోశాధికారిగా తురస చంటి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నేతావత్ సుధాకర్, గౌరవ అధ్యక్షుడిగా భూక్యా సునీల్, గౌరవ సలహాదారుగా శ్రావణ్, వైస్ ప్రెసిడెంట్లుగా పూనెం ప్రతాప్, పోరిక సునీల్, కార్యవర్గ సభ్యులుగా యుగంధర్, తెల్లం ఆనంద్, పాయం అజయ్, వసం నరేందర్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులను తోటి జర్నలిస్టులు ఘనంగా సన్మానించారు.

ఆలయ నిర్మాణ కమిటీ..

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలో ఆదివారం విశ్వబ్రహ్మణ కులసంఘం నాయకులు సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సమావేశంలో వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ నిర్మాణం కోసం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎలకంటి యుగేంద్రచారి, ప్రధాన కార్యదర్శిగా ఎలకంటి రవీంద్రచారి, కోశాధికారిగా తంగెళ్లపల్లి శంకరమూర్తి, ఉపాధ్యక్షుడిగా చెల్లోజు నర్సింహచారి, సహాయ కార్యదర్శులుగా ఎలకంటి రమేశ్, తంగెళ్లపల్లి వీరబ్రహ్మం ,కార్యవర్గ సభ్యులుగా వీణవంక సునీల్, వీణవంక లక్ష్మీనారాయణ, నిరంజన్, ప్రసాద్, వీరాచారిలను ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు.

భూమి పూజ



టేకుమట్ల: టేకుమట్ల–చిట్యాల ప్రధాన రోడ్డు రామకిష్టాపూర్(టీ) శివారులో మాజీ జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి రైస్‌మిల్ నిర్మాణం చేపడుతున్నాడు. కాగా, ఆదివారం నిర్వహించిన భూమి పూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. నాయకులు అంజిరెడ్డి, విజేందర్‌రెడ్డి, పాలవేని పోశాలు, కొమురయ్య, రాజమౌళి, సరోత్తం రెడ్డి పాల్గొన్నారు.

గుడుంబా స్వాధీనం

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలో గుడుంబా తరలిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పవన్ కుమార్ ఆదివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. తమకు వచ్చిన నమ్మదగిన సమాచారం మేరకు మహదేవపూర్ బస్టాండ్ వద్ద తనిఖీ చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో మహాముత్తారం మండలం కోర్లకుంట గ్రామానికి చెందిన నూనవత్ రాజశేఖర్, రాళ్లబండి లక్ష్మణ్‌ల నుంచి 10లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పరామర్శ



మొగుళ్లపల్లి: మండలంలోని గణేశ్‌పల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు నాగలగాని వీరేశం తల్లి లచ్చమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని ఆదివారం తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్ రావు పరామర్శించారు. చిట్యాల మార్కెట్ మాజీ చైర్మన్ కోడారి రమేశ్, చదువు అన్నారెడ్డి, ఉన్నారు.

బాబోయ్ శునకాలు

- మూడు నెలల్లో 118 మందిని కరిచిన కుక్కలు
- నమోదు కాని కేసులు ఇంకా ఎన్నో!

వాజేడు: మండలంలో శునకాలు రెచ్చి పోతున్నాయి. మండల వ్యాప్తంగా కుక్కల బెడద బాగా పెరుగడంతో ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితి. సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్‌లో ఇప్పటి వరకూ అధికారిక లెక్కల ప్రకారం 118 మందిపై దాడి చేసి గాయపర్చాయి. వాజేడులో 75 కేసులు, పేరూరులో 43 కేసులు నమోదు కాగా వారికి యాంటి రాబిస్ వ్యాక్సిన్ అందించారు. కాగా, కుక్కల దాడిలో గాయ పడిన వారిలో కొంత మంది మాత్రమే వైద్య శాలలకు వస్తున్నారు. మరికొంత మంది తమకు అందుబాటులో ఉన్న నాటు మందులను పసర్లను సేవిస్తున్నట్లు తెలుస్తుంది. మరి కొందరు ఖర్చులైనా సరే అని సుదూర ప్రాంతాల్లోని ప్రైవేట్ వైద్యశాలలకు వెళ్లి వైద్యం చేయించుకుంటున్నారు. దీంతో మండలంలో అధికారికంగా నమోదు కాని కేసులు ఇంకా ఎన్నో ఉన్నాట్లు సమాచారం.

అందుబాటులో ఏఆర్‌వీ మందులు

కుక్కల దాడిలో గాయపడిన వారికి ఇచ్చే యాంటి రాబీస్ ఇంజక్షన్లు వాజేడు, పేరూరు వైద్య శాలల్లో అందుబాటులో ఉన్నాయి. ఇప్పటి వరకు వైద్యం కోసం ప్రభుత్వ వైద్య శాలలకు వచ్చిన 118 మందికి ఇంజక్షన్లు వేశారు. ఇంజక్షన్ల కొరత లేదని వైద్య సిబ్బంది తెలిపారు. కుక్కలదాడిలో గాయపడకుండా పలు జాగ్రత్తలను తీసుకోవాలని వైద్య సిబ్బంది ప్రజలకు పలుమార్లు అవగాహన కల్పించారు. కుక్కల దాడిలో గాయపడిన వారికి గాయాలు తీవ్రంగా ఉంటే వారిని వెంటనే ములుగు ఏరియా ఆస్పత్రి, వరంగల్ ఎంజీఎంకు రిఫర్ చేస్తున్నారు. అధికారులు స్పందించి కుక్కల భారి నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలని మండల వాసులు కోరుతున్నారు. కుక్కల బెడద ఇలా ఉంతే పిల్లులు సైతం దాడులు చేసి ప్రజలను గాయపరుస్తున్నాయి. మండల పరిధిలోని పేరూరు వైద్యశాలలో పిల్లుల దాడిలో గాయ పడిన కేసులు రెండు నమోదు అయినట్లు వైద్య సిబ్బంది వెల్లడించారు.



వాజేడులో శునకాల గుంపు



కుక్కల దాడిలో వ్యక్తికి గాయాలు(ఫైల్)

అప్రమత్తంగా ఉండాలి

కుక్కల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ప్రమాదకరంగా ఉన్న కేసులను ములుగు, వరంగల్ పంపిస్తున్నాం. ఆస్పత్రిలో మందులు అందుబాటులో ఉన్నాయి.

\- రాహిల్, వైద్యాధికారి, పేరూరు

అమరుల ఆశయాల సాధనకు కృషి



విప్లవాభివాదం చేస్తున్న నాయకులు

ములుగు: పీడీఎస్‌యూ అమరవీరుల ఆశయాల సాధన కోసం కృషి చేయాలని పీడీఎస్‌యూ పూర్వ విద్యార్థిని, అరుణోదయ సాంస్కృతిక సమైక్య రాష్ట్ర అధ్యక్షురాలు కామ్రెడ్ విమలక్క, కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఈసం నారాయణ, మాజీ ప్రొఫెసర్ వెంకట్ నారాయణ అన్నారు. పీడీఎస్‌యూ పూర్వ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 50 వసంతాల విప్లవ విద్యార్థి యాది సభను ముంజుల భిక్షపతి గౌడ్, పెండెం రాజేందర్, యుగందర్, వైనాల రవి అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో పీడీఎస్‌యూ విద్యార్థి సంఘాలు ఒక తాటిపై నడవాలన్నారు. అనంతరం పీడీఎస్‌యూ స్తూపాన్ని ఆవిష్కరించి రైతు కూలి కరపత్రాన్ని విమలక్క చేతుల మీదుగా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో ధనసరి సూర్య, కర్ణాటక సమ్మన్న, నరసన్న, పాల్, తీగల జీవన్, అల్లం ఓదెలు, నున్న అప్పారావు, కొత్త పల్లి రవి, వెంకట్ రెడ్డి, నరసింహ, మధు, నాగరాజు, గుండెబోయిన శ్రీనివాస్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

మల్హర్: ముదిరాజ్ మహాసభ దశాబ్ది ఉత్సవాల ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం వాల్ పోస్టర్‌ను మండలంలోని తాడిచర్లలో ముదిరాజ్ సంఘం నాయకులు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పల్లె పల్లెకు ముదిరాజ్ జెండా–ముదిరాజ్ గుండెల్లో చైతన్య ఎజెండా అనే నినాదంతో ఈనెల 21 నిర్వహించే ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా ప్రతీ గ్రామం, పట్టణం, జిల్లా కేంద్రాల్లో ముదిరాజ్ జెండా ఎగరవేసి ర్యాలీలు, సంబురాలు నిర్వహించున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు అక్కినేని సమ్మయ్య ముదిరాజ్, మహాసభ జిల్లా యువత ఉపాధ్యక్షుడు ముద్రవేణి సురేశ్, తాడిచర్ల కుల పెద్ద మనుషులు ఆకుల పర్వతాలు, శంకర్, ఆకుల నరసింగం, గోస్కుల లక్ష్మయ్య, ముద్రవేణి కిష్టయ్య, కుంట సదానందం, చొప్పరి రాజు, జోడు చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

విద్యార్థులకు ఉపన్యాస పోటీలు

భూపాలపల్లి అర్బన్: అంధకారాన్ని తెంచే దీపాలు పుస్తకాలని రిటైర్డ్ ఎంఈఓ పగడాల ఐలయ్య తెలిపారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం స్థానిక గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపన్యాస పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐలయ్య హాజరై మాట్లాడారు. పుస్తక పఠనం ద్వారా విద్యార్థులకు కలిగే ఉపయోగాలను వివరించారు. పుస్తక పఠనం చేసినట్లయితే మనో విజ్ఞానం, మనశాంతి, ఉల్లాసం, ఉత్సాహం, ఏకగ్రత ఉంటుందని జ్ఞాపక శక్తి పెరుగుతుందని తెలిపారు. ఉపాధ్యాయులు శేఖర్, రాజ్‌కుమార్, గ్రంథాలయ సిబ్బంది చంద్రమౌళి, రవీందర్, రాకేశ్, మంజుల పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరం



కంటి వైద్య శిబిరంలో పాల్గొన్న రాకేశ్

ములుగు: జిల్లా కేంద్రంలో ఆదివారం బీఆర్‌ఎస్ నాయకుడు భూక్యా జంపన్న ఆధ్వర్యంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. కంటి ఆపరేషన్ కోసం 400 మంది పరీక్షలను చేయించుకోగా ఇందులో 120 మందిని ఆపరేషన్ కోసం ఎంపిక చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి పేద ప్రజలకు కంటి వైద్యం అందేలా చూశారన్నారు. దానిని ఆదర్శంగా తీసుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వెల్లడించారు. కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందనం రావడం ఆనందంగా ఉందన్నారు.

'ఆదరణ ఓర్వలేకనే ఆరోపణలు'

ఏటూరునాగారం: కాంగ్రెస్‌కు వస్తున్న ఆదరణను ఓర్వలేకనే కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నాడని ఆ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేటీఆర్ చేసిన తప్పులను కప్పిపుచ్చుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నాడన్నారు. తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగులపై బీఆర్‌ఎస్ నాయకులు వరుస దాడులు చేయడం హేమనీయమైన చర్య అన్నారు. వికారాబాద్ కలెక్టర్‌పై దాడి వెనక పెద్ద కుట్ర ఉందని, కేటీఆర్ ఆదేశాల ప్రకారం దాడి చేసినట్లు తెలుస్తోందన్నారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత

రేగొండ: మండలంలోని తిరుమలగిరి శివారులో బుగులోని వేంకటేశ్వర స్వామి జాతరకు ఓ భక్తురాలు తన కుమారుడిలో వచ్చి దర్శనం చేసుకుని జాతరలో షాపింగ్ చేస్తుండగా బాబు ఆదివారం తప్పిపోయినాడు. బాబు తప్పిపోయిన సమాచారం తెలుసుకున్న రేగొండ పోలీసులు జాతరలో గాలించి తప్పిపోయిన బాలుడిని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ధాన్యం కొనుగోలుపై పట్టింపేది?

చిట్యాల: మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలనే జ్యాస సంబంధిత అధికారులకు లేదని పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాలలో పంటలను కోసి ధాన్యాన్ని రోడ్లపై, మార్కెట్ ఆవరణంలో పోసి పదిహేను రోజులు అవుతున్న కనీసం సంబంధిత అధికారులు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు రోడ్లపైనే ధాన్యం ఆరపోయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యాన్ని కొనుగోలు చేసే దిక్కులేక రైతులు నిరాశకు లోనవుతున్నారు. ఇప్పటికైఅధికారులు స్పందించి త్వరగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని పలువురు రైతులు డిమాండ్ చేస్తున్నారు.

వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం

ఎస్ఎస్‌తాడ్వాయి: వ్యాయామం సంపూర్ణ ఆరోగ్యానికి మేలని ఆత్మ మాజీ చైర్మన్ దుర్గం రమణయ్య అన్నారు. ఎస్ఎస్ ఫౌండేషన్ హైదరాబాద్ వారి సౌజన్యంతో ఆదివారం మండలంలోని ఊరట్టంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలోని విద్యార్థినులకు ఫౌండేషన చైర్మన్ కోల సందీప్, ఏటూరునాగారం ఆత్మ మాజీ చైర్మన్ దుర్గం రమణయ్య చేతుల మీదుగా ఆట వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దుర్గం రమణయ్య మాట్లాడుతూ.. చదువుతోపాటు వ్యాయామ విద్య ఎంతో అవసరమన్నారు. ప్రతీ రోజు వ్యాయమం చేయడం ద్వారా శరీరం ధృడంగా ఉల్లాసంగా ఉంటుందని, మేధశక్తి పెరుగుతుందన్నారు. విద్యార్థినులకు ఆట వస్తువులు పంపిణీ చేసిన ఫౌండేషన్ చైర్మన్ అభినందించారు. అలాగే ఫౌండేషన్ చైర్మన్ కోల సందీప్ మాట్లాడుతూ తన తండ్రి కోల సైదులు కోరిక మేరకు తన సంపాదనలో కొంత పేద ప్రజల సాయం చేయాలనే ఉద్దేశ్యంతో విద్యార్థినులకు ఆట వస్తువులను పంపిణీ చేసినట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీ మండల మైనారిటీ సెల్ అధ్యక్షుడు మహ్మద్ రఫీ, సీతక్క యువసేన జిల్లా అధ్యక్షుడు చర్పా రవీందర్, కావిరి అంజన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



ఆట వస్తువులను పంపిణీ చేస్తున్న సందీప్

పరిమితికి మించి ప్రయాణించొద్దు



సూచనలు చేస్తున్న సీఐ బండారి కుమార్

వెంకటాపురం(కె): వాహనాల్లో పరిమితికి మించి కూలీలు ప్రయాణించొద్దని సీఐ బండాని కుమార్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని నూగూరు గ్రామ సమీపంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మొక్కజొన్న, మిర్చి పంటలకు కూలీలను తరలిస్తున్న రైతులకు రోడ్డు ప్రమాదాల నివారణపై పలు సూచనలు, సలహాలను ఇచ్చారు. వాహనాలకు సంబంధిచిన అన్ని పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. కొప్పుల తిరుపతి రావు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

మంగపేట: మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన పాండ్ర విష్ణు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని మృతుడి స్నేహితులు ఆదివారం పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. కాగా, మృతుడి భార్య సృజన 2020 కరోనాతో మృతి చెందగా ఇటీవల విష్ణు మృతి చెందాడు. దీంతో వారి కుమారుడు లెనిన్ అనాథగా మారాడు. ప్రస్తుతానికి వృద్ధురాలైన అతడి నానామ్మ జయమ్మ వద్ద ఉంటున్నాడు. దీంతో విష్ణు మిత్రులు బాలుడి పేరిట రూ 8,300 నగదును ఎల్ఐసీలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో దాతలు అంతటి సాంబశివరావు, పగిడిపాల రవిప్రశాంత్, బెనర్జీ, రమేశ్, నిరంజన్, వెంకట్, మున్నా తదితరులు పాల్గొన్నారు.



డిపాజిట్ బాండ్‌ను అందజేస్తున్న దాతలు

అక్రమాలను వెలికితీయాలి

టేకుమట్ల: మండల కేంద్రంలో ఉన్న చేనేత వస్త్ర పరిశ్రమలో జరిగిన అక్రమాలను వెలికితీసి బాధ్యులైన వారిపై చర్య తీసుకోవాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారపెల్లి మల్లేశ్ అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. టేకుమట్లలో చేనేత కార్మికుల ఆర్థిక సంక్షేమార్థం 30 సంవత్సరాల క్రితం చేనేత వస్త్ర పరిశ్రమ, సహాకార క్రయ విక్రయ కో–ఆపరేటీవ్ సొసైటీగా ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. ఆ సంఘంలో 162 మంది సభ్యులు ఉండేవారని కానీ ప్రస్తుతం 67 మంది సభ్యులే ఉన్నారని అన్నారు. అలాగే సంఘం సభ్యులు మాట్లాడుతూ.. కొంత మంది స్వార్థపరుల స్వలాభం కోసం సంబంధిత అధికారులను దగ్గర చేసుకుని అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సభ్యులు పోలు రమేశ్, దూడెం రాములు, పల్లెబోయిన సంపత్, మచ్చగిరి సారయ్య కోమాకుల చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మారపెల్లి మల్లేశ్

చర్య తీసుకోవాలని ఫిర్యాదు



కొయ్యూరులో ఫిర్యాదు చేస్తున్న నాయకులు

మల్హర్: ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, కాంగ్రెస్ నాయకుడు శ్రీను బాబుపై ఆధారం లేని నిరధారమైన ఆరోపణలు చేసిన చల్ల నారాయణరెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల మండల అధ్యక్షుడు బడితెల రాజయ్య ఆధ్వర్యంలో నాయకులు ఆదివారం కొయ్యూరు పోలీసు స్టేషన్‌ల్లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాటారం మండలం ధన్వాడ గ్రామానికి చెందిన నారాయణరెడ్డి సోషల్ మీడియా, యూట్యూబ్ ఛానాలల్లో మంత్రి శ్రీధర్‌బాబు, శ్రీనుబాబులపై ఆధారాలు లేని ఆరోపణలు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, రమేశ్, కటకం శ్రీను, నారాయణ ఉన్నారు.



కాళేశ్వరంలో..

చల్ల నారాయణరెడ్డిపై ఫిర్యాదు

కాళేశ్వరం: రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అతడి సోదరుడు శీనుబాబులపై కాటారం మండలం ధన్వాడకు చెందిన చల్ల నారాయణరెడ్డి శనివారం ఓ యూట్యూబ్ ఛానల్‌లో మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధును హత్య చేయాలని వారిద్దరు ప్రొత్సహించారని నిరాధారమైన ఆరోపణలు చేశారు. దీంతో అన్నారం మాజీ ఎంపీటీసీ మంచినీళ్ల దుర్గయ్య నారాయణరెడ్డి అసత్యపు ఆరోపణలు చేశాడని కాళేశ్వరం పోలీసుస్టేషన్‌లో ఏఎస్సై రాజేశానికి ఫిర్యాదు చేశాడు. ఎలాంటి ఆధారాలు లేకుండా ఆరోపణలు చేసిన ఆయనపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయన వెంట కాంగ్రెస్‌పార్టీ నాయకులు లేతకరి రాజబాపు తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' కథ కంచికేనా?

- ఎనిమిదేళ్లు అయిన పూర్తికాని డబుల్ బెడ్రూం ఇళ్లు
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- అర్హుల ఎదురుచూపు

టేకుమట్ల: గత ప్రభుత్వ హయాంలో మంజూరైన డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం ప్రారంభించి ఇప్పటి వరకు ఎనిమిది సంవత్సారాలు కావస్తున్నా పూర్తి స్థాయిలో పూర్తి కాలేదు. మండలంలో రాఘవాపూర్‌లో 50, గర్మిళ్లపల్లిలో50, రామకిష్టాపూర్(టి)లో 50, ద్వారకపేటలో 30, ఎంపేడులో30 ఇళ్లు మంజూరు అయ్యాయి. కాగా, గర్మిళ్లపల్లి, రాఘవాపూర్, రామకిష్టాపూర్(టి)లో 90శాతం పూర్తి కాగా, ద్వారకపేటలో, ఎంపేడులో ఇళ్లు ఇప్పటి వరకు 50శాతం కూడా నిర్మాణం జరుగకపోవడంతో లబ్ధిదారులు ఇళ్ల కోసం ఎదురు చూస్తున్నారు. చాలా గ్రామాల్లో ఎక్కువ శాతం లబ్ధిదారులు సొంతంగా కొంత నగదును కలుపుకోని ఇంటి నిర్మాణాన్ని చేసుకున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఇంటి నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా పూర్తి అయ్యేనా అంటూ లబ్ధిదారులు సొంతింటి కల కోసం ఎదురు చూస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పాత డబుల్ బెడ్రూ ఇళ్లను పూర్తి చేసేందుకు నిధులు విడుదల చేసి, పూర్తి అయ్యేందుకు సహకరించాలని కోరుతున్నారు.



ఎంపేడులో నిర్మాణ దశలో ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లు

ఎదురు చూస్తున్నారు..



బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన డబుల బెడ్రూంల నిర్మాణానికి నిధులు మంజూరు కాకపోవడంతో నిర్మాణాలు అర్థాంతరంగా నిలిచిపోయాయి. డబుల్ బెడ్రూంల కోసం నిరుపేదలు ఎదురు చూస్తున్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో నిధులు మంజూరు కాలేదు. ఇప్పటికైనా నిధులు మంజూరు చేస్తే నిర్మాణాలు పూర్తయి లబ్ధిదారులు కొత్త ఇంటికి వస్తారు.

\-రాజయ్య, మాజీ సర్పంచ్ ఎంపేడు


ఒక్క ఇల్లు కూడా నిర్మించలేదు..



ద్వారకపేట గ్రామానికి 30 డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు కాగా గతం నుంచి నిర్మాణ దశలోనే ఉన్నాయి. ఇన్ని సంవత్సరాలలో ఒక్క ఇంటి నిర్మాణం కూడా పూర్తి చేయలేదు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి నిరుపేదలకు మంజూరైన డబుల బెడ్రూంలకు నిధులు మంజూరు చేసి ఇంటి నిర్మాణాలను పూర్తి చేయాలి.

\- అరవింద్, ద్వారకపేట

పంట రక్షణకు రైతుల పాట్లు



రేగొండ: మండలంలోని తిరుమలగిరి శివారులో బుగులోని జాతర బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. కాగా, జాతరకు వెళ్లే రోడ్లను అధికారులు పట్టించుకోకపోవడంతో వాహనాల రాకపోకలతో లేచే దుమ్ము రోడ్డు పక్కనున్న పంట చేలపై పేరుకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీంతో ఓ రైతు తన పంటను రక్షించుకునేందుకు తన వ్యవసాయ మోటారు నుంచి సొంతగా ప్రత్యేక పైప్‌లైన్ ఏర్పరుచుకుని రోడ్డుపై నీళ్లను చల్లుతూ తన పంటపై దుమ్ము చేరకుండా నివారించుకున్నాడు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్లపై నీళ్ల చల్లి తమ పంటలను రక్షించాలని రైతులు కోరుతున్నారు.